సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సిఐడి తనిఖీలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డు గదిని గురువారం సిఐడి అధికారులు తనిఖీ చేశారు. మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి ఇసి, నకళ్లు, అరిహేచ్‌లతో పాటు వివిధ రకాల రికార్డులను సిఐడి అధికారులు పరిశీలించారు. కార్యాలయంలోని కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దగ్ధం కేసుపై ఈ తనిఖీలు జరుగుతున్నాయని అధికారులు వెల్లడించారు. ఎలాంటి ఫైళ్లు, హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకోలేదని, కేవలం తనిఖీలు మాత్రమే చేస్తున్నామని సిఐడి అధికారులు స్పష్టం చేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సిఐడి అధికారులు

కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న కేంద్రం

- 26న ర్యాలీ, సభను విజయవంతం చేయాలి
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ దేశ ప్రజలకు ద్రోహం చేస్తోందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు అన్నారు. గురువారం జిల్లా సిఐటియు నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఓ ప్రయివేట్ కళాశాలలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక, ఉద్యోగ, కర్షకుల సంక్షేమం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న అఖిల ట్రేడ్ యూనియన్స్, అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టబోయే భారీ ర్యాలీ, సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మూడవ సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి కార్మిక, ఉద్యోగ, కర్షకుల పట్ల వినాశకర విధానాలు తీసుకొస్తూ కేవలం కార్పొరేట్లకు లాభాలు కోసమే ఊడిగం చేస్తున్నారని పేర్కొన్నారు. రూ.15 లక్షల కోట్ల రుణమాఫీ చేశారని తెలిపారు. కార్మికులకు నష్టం తెచ్చే నాలుగు లేబర్ కోడ్లు తెస్తున్నారన్నారు. వ్యవసాయ రంగంలో మూడు నల్ల చట్టాలను రైతులు సంవత్సరం పాటు పోరాడి రద్దు చేసుకున్నారని, కానీ లేబర్ కోడ్లు రద్దు చేసేంతవరకు పోరాటాలు చేయాలని పేర్కొన్నారు. ధరలు 300 రెట్లు పెరిగినా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయడంలో దారుణం అన్నారు. రైతుల ఆత్మహత్యలు నివారించాలని, ఉపాధి పథకం పటిష్టంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని విశాఖపట్నం ఉక్కు పరిశ్రమ రక్షణకై ప్రజా పోరాటాలు చేయాలన్నారు. స్కీమ్ వర్కర్స్ జీతాలు పెంపుదల కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణకై ప్రత్యేక చట్టాలు అమలు పరచాలని ప్రజా పంపిణీ పథకం సమగ్రంగా అమలుచేయాలని నిరుద్యోగ సమస్యకు పరిష్కారం నెలకొల్పాలని తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ జిల్లాలోని కార్మికులు ఉద్యోగులు ప్రజలను సమీకరించి ఐక్య ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలను ప్రతిఘటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, డి.భాగ్యలక్ష్మి, ఎస్.ఓబుళమ్మ ఎస్.మెహరున్నిసా పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఓబులు, నాయకులు

సమస్యలపై ప్రజాపోరు

4న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా
సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు

ప్రజాపోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసులు, నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నవంబర్ 8 నుండి 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపోరు పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించాలని, ఈనెల 14న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం రాయచోటి పట్టణంలో ప్రజాపోరు ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, వంటనూనె, కూరగాయల ధరలు ఆకాశనంటుతున్నాయన్నారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువత నిరాశకు గురవుతున్నారని, డిఎస్‌సి వాయిదా పడిందని, గ్రూప్-1, గ్రూప్-2 ఆశగానే ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లలపై, దళితులపై అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, ఆచూకీ కనపడని ఆడపిల్లల సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వానికి భిన్నమైన పాలన అందిస్తామన్న కూటమి వాగ్దానాలు అమలులోకి రాలేదని విమర్శించారు. అవినీతి విచ్చలవిడిగా సాగుతున్నదని, ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగిపోతున్నాయని, ఉచిత ఇసుక విధానం నేటికీ అమల్లోకి రాలేదని భవన నిర్మాణ కార్మికులు, రవాణా వాహన యజమానులు, కార్మికులు, ర్యాంపులలో కార్మికులు, నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మద్యాన్ని నియంత్రించాల్సింది పోయి ఏరులై పారించాలనుకోవడం ప్రజల ఆదాయాన్ని, ఆరోగ్యాన్ని కొల్లగొట్టడమే అవుతుందని ఆరోపించారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూనే ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.20 వేల కోట భారాన్ని ప్రజలపై వేయడాన్ని తప్పుపట్టారు. గత ప్రభుత్వ హయాంలో వేసిన ట్రూఅప్ ఛార్జీలను ఉపసంహరించుకుంటూ రెగ్యులేటరీ కమిషన్‌కు తెలియజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూపర్ 6 సహా గత ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం చేసిన వాగ్దానాలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాలసేకరణ ధరను రూ.3 తగ్గించి పాడి రైతుల నడ్డివిరిచిందని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్వాసి తులకు చట్టప్రకారం పరిహారం అందించి నిర్వాసితులను ఆదుకోవాలని పేర్కొన్నారు. పేదలు స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టాలివ్వాలని, భూ కబ్జాలను అరికట్టాలని కోరారు. యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులిచ్చి రుణ సదుపాయం, ప్రభుత్వ పథకాలు వారికి వర్తింపజేయాలని కోరారు. పేదలకు కేటాయించిన ప్రభుత్వ ఇళ్ళ కాలనీల్లో ఇండ్ల నిర్మాణానికి అయ్యేఖర్చు ప్రభుత్వమే భరించి పూర్తి చేయాలని, రోడ్లు, మంచినీరు, విద్యుత్, వీధిల్కైట్లు, డ్రెయిన్‌లు, అంగన్‌వాడీ కేంద్రాలు ఇతర మౌలిక వసతులు కల్పించి నివాస యోగ్యంగ చేయాలని డిమాండ్ చేశారు. ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా జమిలి ఎన్నికల పేరుతో ప్రజాస్వామ్యం గొంతు నులిమే కేంద్ర ప్రయత్నాలను తెలుగుదేశం బలపర్చడం గర్హనీయం అన్నారు. వక్ఫ్ ఆస్తులపై పెత్తనం కోసం కేంద్రం తెచ్చిన చట్ట సవరణలను కూడా తెలుగుదేశం బలపర్చడం సిగ్గుచేటు అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామచంద్ర, నాగరాజు, రమణయ్య, మునెప్ప పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య

కేన్సర్‌కు మనోధైర్యమే మందు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కేన్సర్ మహమ్మారిని తరిమికొట్టేందుకు మనోధైర్యమే మందని డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య అన్నారు. గురువారం కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం 40వేల మంది కేన్సర్ బారినపడి చనిపోతున్నారని అన్నారు. దీనిని నివారించడం కోసం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి తొలి దశలోనే కేన్సర్‌ను నివారించవచ్చన్నారు. ఆహార అలవాట్లు అనుగుణంగా ప్రతి ఏడు మందిలో ఒకరు కేన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. క్యాన్సర్ అంటువ్యాధి కాదని వంశపారంగా వచ్చే వ్యాధి కూడా కాదన్నారు. శరీరంలో కేన్సర్ కణం పుడితే అది ఏ వైపుకు విస్తరిస్తుందో తెలియదన్నారు. ప్రజలు క్యాన్సర్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్ల పైబడిన వారు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, డిపిఎంఒ రియాజ్ బేక్, ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ శివ ప్రతాప్, పిఒ యూనిట్ వైద్యులు డాక్టర్ అనిత వని, అదనపు ఎంపిహెచ్ఒ దేవ శిరోమణి, హెల్త్ ఎడ్యుకేటర్ మొహమ్మద్ రఫీ, ఉషారాణి, వెంకటేష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హైదర్ అలీ, ఉపాధ్యాయులు విశ్వ ప్రతాప్, సుగుణ, ఆరోగ్య పర్యవేక్షకులు ఖాదర్ భాష ఫర్ జానా నూర్జహాన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **కలకడ :** కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారులు డాక్టర్ మల్లికార్జున, కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కలకడ ఎర్రకోటపల్లి పిహెచ్‌సిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజమ్మ ,హెల్త్ సూపర్వైజర్ వెంకటేశ్వరరావు, రామకృష్ణమ్మ స్టాఫ్ నర్స్ భారతమ్మ, ఎంఎల్‌హెచ్‌పి అశ్విని, ఎఎన్ఎంలు వాణి, శారద, పల్లవి, ఫార్మసిస్ట్ షరీఫ్, ఎంఎల్‌హెచ్‌పిలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** కేన్సర్‌పై విజయం సాధించాలంటే స్క్రీనింగ్ తోనే సాధ్యమవుతుందని డాక్టర్లు తేజస్విని, మనికుమార్‌లు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో జాతీయ కేన్సర్ చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నినాదాలు చేస్తూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి క్యాన్సర్ స్క్రీనింగ్ అవసరమన్నారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్ష చేసుకోవడం మంచిది అన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రీచర్డ్స్ అమర సింహరాజు, ఐటిఐ ఇన్స్ట్రక్టర్ సురేంద్ర, ఐసిటిసి కౌన్సిలర్ చంద్రమోహన్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్ హెచ్‌పిలు, ఐటిఐ విద్యార్థులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ ఎస్.మనోజ్ చంద్ర, డాక్టర్ శ్రీనిజ ఆధ్వర్యం సిహెచ్ఒ రాజా పర్యవేక్షణలో కేన్సర్‌పై అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ హరో హరమ్మ, మహేష్, హెల్త్ అసి స్టెంట్లు సుబ్బారెడ్డి, శరత్‌చంద్రరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** కేన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండి ముందే గుర్తిస్తే నివారణ సాధ్యమేనని మదనపల్లె త్యాగరాజ స్ట్రీట్ అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ మోహిత్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు స్టెల్లా, రేష్మ, ఏఎన్ఎంలు, సిహెచ్ఒలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం చేయడంలో యువత ముందుండాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రక్తదానం చేయడంలో యువత ముందుండాలని డిగ్రీ కళాశాల అధినేత వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఆపరేషనల్ మేనేజర్ మల్లిఖార్జున ఆధ్వర్యంలో సిద్దార్థ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మదనపల్లి జిల్లా ఆసుపత్రి రక్తదాన కేంద్రం సిబ్బంది భార్గవ్ నేతృత్వంలోని బృందం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్త యూనిట్లను సేకరించారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. అనంతరం వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం ఎంతో అవసరత ఉంటుందన్నారు. మనమిచ్చే ఒక యూనిట్ రక్తం ద్వారా ఓ జీవితాన్ని నిలబెట్టొచ్చని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో రక్తదానం.. అగ్రస్థానంలో ఉంటుందని తెలియజేశారు. 18 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరు రక్తదానం చేయచ్చని, రక్తదానం చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరడంతో పాటు మరొకరికి ప్రాణాలు నిలబెట్టే అవకాశాన్ని పొందుకుంటామని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి, సిబ్బంది ఆనంద్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పీలేరు జట్టు

ప్రజాశక్తి-పీలేరు

నంద్యాలలో మూడు రోజులపాటు జరగనున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పీలేరు నుంచి గురువారం జట్టు బయలుదేరింది. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు హరినాథ్ మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున సీనియర్స్ విభాగంలో పీలేరు జట్టు పాల్గొంటోందన్నారు. ఈ జట్టుకు పట్టణానికి చెందిన రాచూరు కిరణ్ టీ షర్టు, అంజు, నరేంద్ర ఆహారం, మనోజ్, చరణ్, రాహుల్ రెడ్డి బంతులను సమకూర్చారు. శిక్షణా శిబిరం నిర్వహణ బాధ్యతలను అవినాష్ రెడ్డి, ట్రైలర్ రమణ తీసుకున్నారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సీనియర్ జట్టులో పాల్గొంటున్న క్రీడాకారులు విజయం సాధించి జిల్లాకు పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు.

క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేసిన దాతలు

పథకాల అమలు వేగవంతం చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - కలికిరి/సంబేపల్లి (రాయచోటి)

మండల పరిధిలో ప్రభుత్వ పథకాల అమలు వేగవంతం చేయాలని, విధుల నిర్వహణలో నిర్లిప్తత, అలసత్వం పనికిరాదని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కలికిరి, సంబేపల్లె మండలాలలో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేసి వివిధ పథకాల అమలు తీరును పరిశీలించారు. ఇందులో భాగంగా కలికిరి, సంబేపల్లి ఎంపిడిఒ కార్యాలయాలలో పిజిఆర్ఎస్, అపార్ ఐడి జారీ, గృహ నిర్మాణ ప్రగతి, నవశకం పోర్టల్ లో బ్యాంక్ అకౌంట్ ఆధార్ లింకేజీ, స్కిల్ సెన్సస్ తదితరాలలో తహశీల్దార్, ఎంపిడిఒ, మండల సర్వేయర్లు, విఆర్ఒ, ఎంఇఒ, హౌసింగ్ ఎఇలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిజిఆర్ఎస్ దరఖాస్తులు ఎన్ని వచ్చాయి, పరిష్కరించినవి ఎన్ని, ఇంకను పరిష్కారం చేయాల్సినవి ఎన్ని, పెండింగ్ ఉండడానికి గల కారణాలు ఏమిటి, వాటిని ఎప్పటిలోగా పరిష్కరించాలి, తీసుకున్న చర్యలు తదితరాలపై సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. ప్రతి దరఖాస్తును వేగవంతంగా, నాణ్యతగా పరిష్కరించాలని తెలిపారు. అపార్ ఐడి ప్రగతిపై సమీక్షించారు. ఐడి క్రియేట్ చేయడంలో జాప్యం చేయరాదని చెప్పారు. విఆర్ఒ, పంచాయతీ సెక్రెటరీ ప్రతి పాఠశాలను సందర్శించి, బర్త్ సర్టిఫికెట్లు లేనివారికి నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్ ఇచ్చి లేట్ బర్త్ సర్టిఫికెట్ జారీ చేయాలని, అనంతరం విద్యార్థుల ఆధార్ అప్డేషన్ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. హౌసింగ్‌కు సంబంధించి లేఅవుట్ వారీగా దశల వారి ప్రగతిపై మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష చేశారు. తుది దశలో ఉన్న ఇండ్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే బిఎల్, ఆర్ఎల్ దశల ప్రగతిని సమీక్షించారు. ఇల్లు పూర్తి చేసుకోవడానికి ఎవరికైనా డబ్బులు అవసరం ఉంటే డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయించాలని ఎంపిఎంకు సూచించారు. బిఎల్ నుంచి ఆర్ఎల్ వరకు నిర్మాణంలో ఉన్న ప్రతి లబ్ధిదారు ఇంటికి వెళ్లి నిర్మాణం పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఇప్పటికే ఇండ్లు ఉన్నవారికి ఎవరికైనా పట్టా ఇచ్చి ఉంటే రద్దు చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఇళ్లనిర్మాణ ప్రగతి పై ప్రతిరోజు హౌసింగ్ సిబ్బందితో సమీక్ష చేయాలని ఎంపిడిఒను ఆదేశించారు. మంజూరైన ప్రతి ఇంటిని మూడు రోజుల్లోపు జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. సిటిజన్ చార్ట్ మేరకు రెవెన్యూ సర్వీసులను నిర్ణీత కాలపరిమితిలోగా పారదర్శకంగా అందజేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వివిధ అంశాల్లో పలు సూచనలు జారీ చేశారు. కలికిరీ రెడ్డివారిపల్లి 1 లేఔట్ ను కలెక్టర్ అధికారులతో సందర్శించి నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. సంబేపల్లి అంగన్వాడీ ప్రీ స్కూల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అటెండెన్స్ పరిశీలించారు. ఎంతమంది పిల్లలు ఉన్నారు, హాజరు శాతం ఎంత, సరిగా హాజరు కాని వారి గురించి కారణాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ స్కూల్‌ను మరింత మెరుగుగా నిర్వహించాలని టీచర్లు, ఆయాలు, సూపర్‌వైజర్‌కు సూచించారు. సంబేపల్లి ప్రకాష్ నగర్ కాలనీలో ఒకే పట్టాను ఇరువురు వ్యక్తులకు ఇచ్చిన అంశంలో స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి రికార్డులను, స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. సంబేపల్లి మండలంలోని మూటకట్ల రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 467లో 40 సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు సదరు స్థలాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయికి వెళ్లి స్వయంగా పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. వరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మదనపల్లి, రాయచోటి ఆర్‌డిఒలు రాఘువేంద్ర, శ్రీనివాస్, హౌసింగ్, డ్వామా పీడీలు శివయ్య, వెంకటరత్నం, డిపిఒ బలరామిరెడ్డి, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, ఎంఇఒలు, హౌసింగ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, విఆర్ఒలు, పంచాయతీ సెక్రటరీలు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

సంబేపల్లిలో ప్రభుత్వ ఆక్రమిత స్థలం పరిశీలిస్తున్న కలెక్టర్

ఫీజుల పేరుతో విద్యార్థులను వేధించడం దారుణం

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ

సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రభుత్వాలు మారుతున్నా అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో యాజమాన్యం తీరు మారడం లేదని, ప్రభుత్వం ఆదేశాలు సైతం లెక్కచేయకుండా ఫీజుల పేరుతో విద్యార్థులను వేధించడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహ మండిపడ్డారు. గురువారం స్థానిక ఐటిఐ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాలను సైతం లెక్కచేయకుండా అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో విద్యార్థులను ఫీజులు కట్టాలని వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. కళాశాల ఫీజులు కట్టలేక విద్యార్థులు వసతి గదులకే పరిమితం అవుతున్నారని ఆవేదన చెందారు. తక్షణమే జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ స్పందించి అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో ట్యూషన్, బిల్డింగ్, మెయింటినెన్స్ సంబంధం లేకుండా తక్షణమే పరీక్ష ఫీజులు కట్టించుకొనేట్లు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం డబ్బులు కట్టలేక విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించి ఒక నెల సమయం అడిగినా తమకు ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కళాశాల అకౌంట్‌కు ప్రభుత్వం చెల్లించిన తర్వాత చూద్దామని వేధింపులకు గురి చేస్తుండడం విద్యార్థుల భవిష్యత్తు పట్ల కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనమని మండిపడ్డారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కళాశాల ఖాతాలోకి డబ్బులు వేస్తామని చెప్తున్న ప్పటికీ అన్నమాచార్య కళాశాల యాజమాన్యం మాత్రం విద్యార్థులను వేధిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ప్రతి కళాశాలకు ఫీజులు నిర్ణయించినప్పటికీ అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఏర్పడినప్పటి నుంచి ఫీజులు తమ ఇష్టారాజ్యంగా పెంచుకుంటూ విద్యను వ్యాపార వనరుగా చేసుకొని లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అనేక కోర్సుల రూపంలో విద్యార్థుల తల్లిదండ్రుల రక్తపు మాంసాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం విద్యార్థులు బిల్డింగ్ ఫీజు, మెయింటినెన్స్ ఫీజు కూడా చెల్లించాలని తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఏం చేయాలో దిక్కుతోచక అప్పులు చేసే పరిస్థితిలో ఉన్నారని ఆవేదన చెందారు. అన్నమాచార్యలో ఫీజులుపైనున్న శ్రద్ధ విద్యార్థుల చదువు పైన లేదని పేర్కొన్నారు. విద్యార్థులను ఫీజులు సకాలంలో కట్టకపోతే ప్రతిరోజు వెయ్యి రూపాయలు అపరాధ రుసుంతో కట్టాల్సి వస్తుందని విద్యార్థులను బెదిరిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో ఫీజుల వేధింపుల నుండి విద్యార్థులను కాపాడాలని ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా కమిటీ తరపున విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో అన్నమాచార్య విద్యార్థులను చైతన్యం చేసి దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో రాజంపేట ఎస్ఎఫ్ఐ నాయకులు సూర్య వర్ధన్, వినోద్, పవన్, సాకేత్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు

ప్రజాశక్తి- రాయచోటి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు డిఎస్‌సి (సెకండ్ గ్రేడ్ టీచర్స్) పరీక్షలకు ఉచిత శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అధ్యయన కేంద్రం (ఎపి బిసి స్టడీ సర్కిల్) జిల్లా సంచాలకులు సందప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన నిరుద్యోగ బిసి, ఎస్‌సి, ఎస్‌టి, అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు ఉండి, టిటిసి, టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉచిత శిక్షణ తరగతుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. మొత్తం 200 మంది అభ్యర్థులను ఎంపిక చేసి 60 రోజుల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు ఎస్ఎస్‌సి, ఇంటర్, టిటిసి మార్కుల జాబితాలు, కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు జతపరిచి తమ కార్యాలయంలో ఈనెల 12 లోపు అందజేయాలన్నారు.

ఉరుసు మహోత్సవానికి 'సుగవాసి'కి ఆహ్వానం

ప్రజాశక్తి - రాయచోటి : కడప అమీన్ పీర్ దర్గాలో ఈనెల 16 నుంచి 21 వరకు నిర్వహించబోయే ఉరుసు మహోత్సవానికి టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబుకు దర్గా కమిటీ నాయకులు ఆహ్వాన పత్రికను అందజేశారు. కడప ఆమీన్ పీర్ పెద్ద దర్గా గంధం, ఉరుసు మహోత్సవానికి విచ్చేయాలని గురువారం రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని టిటిడిపి కార్యాలయంలో ప్రసాద్‌బాబును కడప దర్గా పీఠాధిపతుల శిష్య బృందం ఆహ్వానించారు.

యూనివర్సిటీ క్రికెట్ జట్టుకు 'మిట్స్' విద్యార్థి

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ కళాశాలలో ఇసిఇ బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న మౌర్య జెఎన్‌టియు యూనివర్శిటీ క్రికెట్ టీంకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ ఎంపికలు గూడూరులోని ఆదిశంకర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో జరిగినట్లు, ప్రతిభ కనపరచిన రౌతు మౌర్య యూనివర్సిటీ క్రికెట్ టీంకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థిని కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేసారు.

మౌర్యను అభినందిస్తున్న ప్రిన్సిపల్

మాట్లాడుతున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

బదిలీలతో మనోస్థైర్యం దెబ్బతీస్తున్నారు : వైసిపి

ప్రజాశక్తి - రాయచోటి

ఎన్నికల హామీల అమలులో విఫలమైన కూటమి ప్రభుత్వం వాటిని ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపు చర్యలకు కూటమి ప్రభుత్వం పాల్పడుతోందని, బదిలీల పేరుతో పోలీసుల అధికారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్ నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజకీయాలలో అధికారంలో ఉన్నా , ప్రతిపక్షంలో ఉన్నా విలువలను తాము పాటించామన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలోని పరిస్థితులను చూస్తుంటే చాలా బాధేస్తుందన్నారు. వైఎస్ఆర్‌సిపి సోషియల్ మీడియాను చెడుగుడు ఆడుతామని బెదిరిస్తుండడం హేయమైన చర్యగా అభివర్ణించారు. సోషియల్ మీడియా వారిని అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ప్రతి పక్ష పార్టీల అంతు చూస్తామని బెదిరిస్తున్నారన్నారు. పోలీసులు సివిల్ డ్రస్సెస్‌లలో అర్ధరాత్రి వేళల్లో సోషియల్ మీడియా వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను సైతం భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. ప్రజా స్వామ్యంలో తప్పు చేయని వారిని ఏమీ చేయలేరన్నారు. తాము కూడా తప్పును ప్రోత్సహించమన్నారు. మహిళలను వ్యక్తిగతంగా విమర్శించకూడదని, అవా స్తవాలను ప్రచారం చేయకూడదని తమ పార్టీ సోషియల్ మీడియా వారికి కూడా సూచించిందన్నారు. నియోజకవర్గంలోని గాలివీడు మండలం అరవీడు గ్రామానికి చెందిన సోషియల్ మీడియాకు చెందిన కె.హనుమంత్‌రెడ్డిని అరెస్టు చేశారని చెప్పారు. అతను ఎక్కడున్నారని పోలీసులను అడుగుతున్నా సమాధానం చెప్పడం లేదన్నారు. వెంటనే అతనిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో చంద్రబాబు బూటకపు హామీలు ఇచ్చి పబ్బం గడుపుకుని అధికారంలోకి వచ్చి ఆరు మాసాలవుతున్నా ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయడం లేదన్నారు. తల్లికి వందనం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే ఎంతమందికి రూ 15 వేలు చొప్పున ఇస్తామని చెప్పారే కానీ హామీ అమలుకు కృషి చేయడం లేదన్నారు. చంద్రబాబు తన పాలనలో ప్రజలకు మేలు చేయకపోగా, గత ప్రభుత్వం పై నిందలు వేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వంపైన ప్రధాన సమస్యలు వచ్చినప్పుడు ఈ విధంగా ప్రజల దృష్టిని మార్చడంలో చంద్రబాబు సిద్ధహస్తులన్నారు. వైసిపి శ్రేణులకు, సోషియల్ మీడియాకు ఎల్లవేళలా తోడుగా పార్టీ అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు ముందుండి ఆందోళనలు చేపడతామని తెలిపారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న రూపానందరెడ్డి

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : 'ముక్కా'

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు సత్వర పరిష్కారం వచ్చేలా కృషి చేస్తామని రైల్వేకోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన సొంత గ్రామమైన ముక్కావారిపల్లి నివాసం వద్ద నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాలకు సంబంధించిన అర్జీదారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. గత కొన్ని సంవత్సరాల నుంచి గ్రామాలలో పేరుకుపోయిన ప్రజా సమస్యలను రూపానందరెడ్డి దృష్టికి తీసుకవచ్చారు. భూ సమస్యలు, విద్యుత్, తాగునీరు, రోడ్లు, తదితర సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి, సాయివికాస్‌రెడ్డి, శిరీషరెడ్డి, అర్జీదారులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ నాగులమ్మ

సిసి రోడ్డుకు భూమిపూజ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని డి.రాచపల్లి పంచాయతీలో పెద్దూరు కస్పా నుంచి గొర్లపల్లెకు సర్పంచ్ నాగులమ్మ, ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, జడ్‌పిటిసి శివరాం గౌడ్, ఎంపిపి నాగులయ్య గురువారం పంచాయతీ నిధులు రూ.4లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంగిమళ్ళ కస్పా నుంచి ఆరెం రెడ్డిగారిపల్లె మీదుగా గొర్లపల్లికి పోవాలంటే చాలా ఇబ్బందిగా ఉండేదని అన్నారు. ఈ రోడ్డు చాలాకాలంగా తగాదాలతో ఉండటంతో మాజీ ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి చొరవ తీసుకొని పెద్ద మనుషులను సమక్షంలో సమస్యను పరిష్కరిం చారని తెలిపారు. ప్రజలు గొడవలు పడకుండా ఈ లింకు సిమెంట్ రోడ్డును సద్వినియం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి, మండల వైసిపి నాయకులు వీరనాగిరెడ్డి, రవి, రామచంద్రారెడ్డి, తారకరెడ్డి, ఆంజనేయులు, వేణుగోపాల్, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

నాణ్యమైన భోజనాన్ని అందించాలి :'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త యల్ల టూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. గురువారం జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ఏర్పాట్లను పర్యవేక్షించి ఆహార నాణ్యతను పరిశీలించారు. బాలికల చదువులు, వారి భద్రతమీద హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలను, వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా వుంచాలని, బాలికల విషయంలో అశ్రద్ధ చేయకూడదని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జయలక్ష్మి, ఉపాధ్యాయులు రమణయ్య, వరప్రసాద్, రాధమ్మ, ఆదిలక్ష్మి, లక్షుమ్మ, కడిమెళ్ల శ్రీనివాస రాజు, మండల జనసేన నాయకులు కోలాటం హరికృష్ణ, కొమ్మినేని సుబ్బరాయుడు, మామిళ్ల రవి, చిట్టే బాస్కర్, శంకర్ రాజు, నారదాసు రామచంద్ర, మౌలా పాల్గొన్నారు.

ఆచార్య ఎన్‌జి రంగా సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి-కలికిరి

వ్యవసాయ రంగంలో ఎన్‌జి రంగా సేవలు వెలకట్టలేనివని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో ఎన్.జి.రంగా జన్మదిన వేడుకలును ఘనంగా నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మొదటగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విద్యాలయంగా విద్యార్థులు, రైతులకు 1964 సంవత్సరం నుంచి 1996 వరకు సేవలందించి 1996 నుంచి ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విద్యాలయంగా రూపొందింది అని చెప్పారు. శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ పీరు సాహెబ్, డాక్టర్ మాధురి, సోమశేఖర్‌బాబు, డాక్టర్ కె.నవీనలు ఆచార్య ఎన్.జి.రంగా పార్లమెంటేరియన్‌గా, రైతు బాంధవుడిగా అందించిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా అభ్యుదయ రైతు పి.రత్న శేఖర్ రెడ్డి కి సన్మానం నిర్వహించారు. రత్న శేఖర్ రెడ్డి తను అవలబించే ఆధునిక వ్యవసాయ పద్ధతులను గూర్చి తను నిర్వహిస్తున్న వంద రకాల పండ్ల తోటను గూర్చి రైతులకు విశదీకరించి రైతులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల మహానంది నుంచి ప్రాజెక్టు వర్క్‌కు 20 మంది బిఎస్‌సి అగ్రికల్చర్ విద్యార్థులు కూడా పాల్గొన్నారు.

లక్ష్మీదేవి మృతిపై ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో లక్ష్మీదేవి చికిత్స పొందుతూ గత నెల 31న మృతి చెందిన సంఘటనపై రాయచోటి ఆర్‌డిఒ ఎ.శ్రీనివాస్ బృందం విచారణ జరిపింది. కెవిపల్లి మండలం, గోరంట్లపల్లె పంచాయతీ, కురవపల్లెకు చెందిన లక్ష్మీదేవి అనే మహిళకు పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేశారు. కుటుంబ సభ్యులు ఆపరేషన్ వికటించి మృతి చెందిందని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఆర్‌డిఒ, డిఎంహెచ్‌ఒ డాక్టర్ కొండయ్య, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, మదనపల్లె ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ శివరామకృష్ణ, మదనపల్లె జనరల్ సర్జన్ డాక్టర్ రేవతి కమిటీ విచారణ చేసింది. బాధిత కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ఎస్‌కెఆర్ ఆస్పత్రి నిర్వాహకులను విచారించి, ఆపరేషన్ థియేటర్ పరిశీలించారు. అనంతరం ఆపరేషన్ చేసిన వైద్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఆ నివేదికను కలెక్టర్‌కు సమర్పించి బాధితులకు తగిన న్యాయం చేస్తామని ఆర్‌డిఒ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ ఎం. భీమేశ్వర రావు, రెవెన్యూ సిబ్బంది, రేగల్లు పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పీలేరు ఎస్‌కెఆర్ ఆస్పత్రిలో విచారణ చేపట్టిన ఆర్‌డిఒ

మాండవ్య నది నుంచి ఇసుక రవాణా

ఇతర ప్రాంతాలకు తరలుతున్న ఇసుక ట్రాక్టర్లు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. మాండవ్య నది నుంచి ఇసుకను యథేచ్ఛగా తోడేస్తున్నారు. మాండవ్య నది అక్కడక్కడ పొడవునా రోజుకు 100 ట్రిప్పులు పగలు రాత్రి తేడా లేకుండా మండలం నుంచి బయటికి తరలించుకోని పోతున్నారు. ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలించరాదని నిబంధనలు ఉన్న అవేవీ ఇక్కడ అమలు కావడం లేదు. ఇతర ప్రాంతాలకు ఇసుక తరలిపోతున్న పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు పేర్కొంటున్నారు. మాండవ్య నది నుంచి భారీగా ఇసుకను తరలించు కుపోవడంతో భవిష్యత్తులో ఈ ప్రాంత వాసులకు ఇసుక దొరకని పరిస్థితి ఏర్పడే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని మంచినీటి పథకాలకు మాండవ్య నదిలో బోర్ల ద్వారానే తాగునీటిని, పంటలకు, సరఫరా చేస్తారని అన్నారు. ఇప్పటికే మాండవ్య నదిలో ఇసుక తీయడం వలన నీళ్లు నిల్వ ఉండని పరిస్థితి నెలకొందని, ఉన్న కాస్త ఇసుకను కూడా తరలిస్తే భవిష్యత్తులో వీరబల్లి మండలానికి నీటి సమస్య తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కొన్ని కొన్ని గ్రామాల్లో నీటి సమస్య ఏర్పడిందని, నీటి సమస్య వలన ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా ఆపాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇసుక సురులు మాండవ్య నది నుంచి ఇసుకను తీసుకుని పోయి తమ తోటల్లో గుట్టలు గుట్టలుగా తోలుకొని రాత్రి సమయంలో అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని అన్నారు. గ్రామపంచాయతీ అధికారులు, పాలకవర్గం సభ్యులు, రెవిన్యూ అధికారులు, పట్టించుకోకపోవడంతో ఇసుకాసురులకు అడ్డు అదుపు లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వ అధికారులు, పాలకులు పట్టించుకోని ఇసుక ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు : సిఐ

ప్రజాశక్తి-కలకడ

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా చూడాలని కలకడ సిఐ గురునాథ సూచించారు. మండల కేంద్రమైన కలకడ పోలీసు స్టేషన్‌లో టమోటా మార్కెట్ మండీల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలకడ-గుర్రంకొండ రహదారిలో ఉన్న టమోటా మార్కెట్ వద్ద ప్రయివేట్ వాహనాలతో రహదారి చాలా రద్దీగా ఉందని అన్నారు. వాహనాల రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా ఉందని వారికి తెలియజేశారు. ఇందుకోసం టమోటాల కోసం వచ్చే లారీలు, వాహనాలను మార్కెట్ లోపల ఉంచుకొని గుర్రంకొండ -కలకడ రహదారిలో రాకపోకలకు అంతరాయం కలిగించకుండా జాగ్రత్తలు వహించాలని సూచించినట్లు తెలిపారు. మార్కెట్ సమీపంలో ఏదైనా ప్రమాదాలు జరిగితే మండీల యజమానులే బాధ్యత వహించవలసి వస్తుందని హెచ్చరించారు. కలకడ-గుర్రంకొండ రహదారిలో ఆదర్శ పాఠశాల, ఉర్దూ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాల ఉన్నాయని అన్నారు. గ్యాస్ గోడౌన్, చైతన్య, ఆక్స్‌ఫర్డ్ వంటి ప్రయివేట్ స్కూల్స్ కూడా ఉన్నాయని తెలిపారు. ప్రజలకు, విద్యార్థులకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించవద్దని చెప్పారు. టమోటాలు వచ్చిపోయే వాహనాలను మార్కెట్ లోపల ఉంచుకొని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడవలసిన బాధ్యత మార్కెట్ మండీల యజమానులపై ఉందని గుర్తు చేశారు. మార్కెట్ సమీ పంలో టమోటాలకు వచ్చే వాహనాలు రోడ్డుకు అడ్డంగా నిలిపిన యెడల వారికి అపరాధ రుసుం వేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రామాంజనేయులు, టమోటా మార్కెట్ మండీల యజమానులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టమోటా మార్కెట్ యజమానులతో మాట్లాడుతున్న సిఐ గురునాథ

స్కౌట్ విద్యార్థులు ఆదర్శంగా నిలవాలి

మాట్లాడుతున్న నరసింహారెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఆదర్శంగా నిలవాలని జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం రామాపురం ఆదర్శ పాఠశాలలో స్కౌట్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్ పథకాన్ని ఎగరవేసి వందన సమర్పణ చేశారు. అనంతరం విద్యార్థు లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ స్కౌట్ స్థాపించి 75సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవ వేడుకలకు రామాపురం ఆదర్శ పాఠశాల వేదిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తి, అంకితభావం పెంపొందడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ తోడ్పడుతుందన్నారు. స్కౌట్స్ శిక్షణ ద్వారా విద్యార్థులలో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక వికాసం అలబడుతుందని అన్నారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు, ఉన్నత విలువలు సమకూరతాయని అన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ సర్టిఫికెట్ కలవారికి జిఒ నెంబర్ 27 ప్రకారం విద్యా, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, గైడ్ కెప్టెన్లు చంద్ర సేన, శివలీల, రమీజా, కెజిబిపి, ఆదర్శ పాఠశాలల స్కౌట్‌అండ్ గైడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అపరాల పంటల సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో అపరాల పంటల సాగుపై కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అపరాల పంటలు సాగు చేయవలసిన ఆవశ్యకతను ఆమె వివరించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించి, పంట సాగు ఖర్చును తగ్గించుకొని అధిక ఆదాయాలను పొందవచ్చునని సూచించారు. డాక్టర్ వై. పీరు సాహెబ్ మాట్లాడుతూ పురుగుల నివారణకు మొదటగా పంటలు విత్తే సమయంలో ఇమిడాక్లోప్రిడ్‌తో విత్తన శుద్ధి చేసి రసం పీల్చే పురుగులు, తద్వారా పల్లాకు తెగులు నివారణ చేపట్టవచ్చని తెలిపారు. నేల ద్వారా సంక్రమించి వేరు కుళ్ళు తెగులు, వడలు తెగులు నివారణ, వెర్రి తెగులు, ఆకు మచ్చ తెగులు, కాయ తోలుచు పురుగు, మారూక మచ్చల పురుగు, శనగపచ్చ పురుగు నివారణ పద్ధతుల గురించి విపులంగా వివరించారు. డాక్టర్ సోమశేఖర్‌బాబు మాట్లాడుతూ అపరాల పంటల్లో అధిక దిగుబడిని అందించే రబీ రకాలు, పోషక యాజమాన్యం గురించి తెలిపారు. డాక్టర్ ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ కెవికె కలికిరిలో వివిధ రకాల మామిడి మొక్క అంట్లు లభిస్తాయని తెలిపారు. వ్యవసాయ పద్ధతుల్లో సందేహాల, సూచనలు, ఆధునిక సాంకేతికత కొరకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం టోల్ ఫ్రీ నెంబర్ 18004250430 అని లేదా కెవికె, కలికిరి సమన్వయకర్త ఫోన్ నెంబర్ 8008500320ను సంప్రదించవచ్చని డాక్టర్ మాధురి చెప్పారు. కార్యక్రమంలో రైతులకు మినుములు, అలసంద, అనప విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

చట్టాన్ని అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని కురిజల పంచాయతీ కేంద్రంలోని పురాతన చెన్నకేశవస్వామి ఆలయభూమి లీజు విషయమై బుధవారం వివాదం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే కురిజల గ్రామంలో అతి పురాతనమైన చెన్నకేశ వస్వామి ఆలయం గత కొన్ని ఏళ్లుగా ధూప దీప నైవేద్య పూజలు లేక శిథిలావస్థకు చేరుకుంది. ఈ ఆలయాన్ని పునరుద్ధరణ చేసి కొత్త ఆలయం నిర్మించాలని గ్రామస్తులు నిర్ణయం తీసుకున్నారు. ఆలయానికి సంబంధించి సర్వే నంబర్ 52/14లో 1.6 సెంట్ల భూమి ఉంది. దీనిని గత ముప్పై సంవత్సరాలుగా ఇదే గ్రామానికి చెందిన చెంగారెడ్డి అనుభవిస్తూ ఉన్నారు. ఈనేపథ్యంలో ఆలయ భూమిని దేవాదాయశాఖ వారు వేలంపాటలో హెచ్చుపాట పాడిన వారికి లీజుకు ఇచ్చి తద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ నిర్మాణానికి వెచ్చించాలని నిర్ణయించుకున్నారు. ఇవిషయమై గ్రామ సభ నిర్వహించగా చంగారెడ్డి అతని అనుచరులు లీజును వ్యతిరేకిస్తూ దేవాదాయ శాఖ అధికారులను అడ్డుకున్నారు. ఇవిషయమై చెంగారెడ్డి అనుచరులకు, ఎండోమెంట్ అధికారుల మధ్య మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ విషయంపై మదనపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే షాజహాన్ బాషా దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లడంతో గురువారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరిని ఉపేక్షించేది లేదని అన్నారు. నేడు ఏడుగురు కమిటీ సభ్యులు ద్వారా రెవెన్యూ, మండల అభివృద్ధి, పోలీసు, ఎండో మెంట్ అధికారుల సమక్షంలో లీజు వేలంపాట నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విజయ్ గౌడ్, మాజీ జడ్‌పిటిసి మునివెంకటస్వామి, సి.నాగరాజ , రెడ్డెప్ప పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవ ప్రశంసనీయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై ఎమ్మెల్యే షాజహాన్ బాషా తీసుకొంటున్న చొరవ ప్రశంస నీయమని మదనపల్లి టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతి రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ గత 12 ఏళ్ళుగా మదనపల్లె టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో కలసి మదనపల్లి పట్టణ ట్రాఫిక్ సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. 2013 నుంచి 2018 వరకు ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, ఈ పరిస్థితులల్లో ఎమ్మెల్యే షాజహన్ బాషా ప్రత్యేక చొరవ తీసుకొని సంబంధిత శాఖల అధికారులతో సంప్రదించి సిటియం రోడ్డులోని ఆక్రమణలు తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి రోడ్డు విస్తరణకు పూనుకోవడం అభినందనీయమన్నారు. వెన్యూ రోడ్డు, గాంధీరోడ్డు, పటేల్ రోడ్డు, చిత్తూరు, బెంగళూరు బస్టాండు ప్రాంతాల్లో కూడా ఆక్రమణలను తొలగించాలన్నారు.

నూతన గురు నిలయం ప్రారంభం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి :

మండల కేంద్రంలోని రాయచోటి-వేంపల్లి జాతీయ రహదారిలో వెలసినటువంటి సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చి ఆవరణలో నూతన గురు నిలయాన్ని గురువారం కడప కథోలిక మేత్రాసన పీఠాధిపతి రెవరెండ్ డాక్టర్ గాలిబాలి ప్రారంభించారు.ఈ సందర్భంగా లక్కిరెడ్డిపల్లి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ విజయమోహన్ రెడ్డి మాట్లాడుతూ కథోలిక గురువుగా 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని నూతన గురు నిలయాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.లక్కిరెడ్డిపల్లి విచారణ గత 20 సంవత్సరములుగా దినదినాభివృద్ధి చెందుతూ ఉందని రాబోయే రోజుల్లో ఇంకా మెండుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అనంతరం బిషప్ గాలిబాలి ఆధ్వర్యంలో దివ్యబలి పూజను ఘనంగా సమర్పించారు. అనంతరం చర్చి ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కడప మేత్రసన గురువులు,కన్యా స్త్రీలు,సంఘ పెద్దలు, విశ్వాసులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అర్హులందరికీ దీపం-2 సిలిండర్ : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి దీపం-2 పథకం ద్వారా ఉచిత సిలిండర్ రాయితీ లభిస్తుందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నందలి పిజిఆర్‌ఎస్ హాల్లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో నవంబర్ 1నుంచి దీపం 2 పథకం ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాలలో శాసన సభ్యులందరూ, ప్రజా ప్రతినిధుల ద్వారా ఈ పథకాన్ని ప్రారంభించారని అన్నారు. దీపం టు పథకానికి జిల్లా వ్యాప్తంగా మంచి స్పందన వస్తోందిన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 33 వేలకు పైగా సిలిండర్లు బుక్ చేసుకున్నారు. అందులో దాదాపు 21 సిలిండర్లు డెలివరీ కూడా చేశారన్నారు. ఉచిత సిలిండర్ పొందడానికి ప్రతి ఒక్కరికి ఆక్టివ్ ఎల్‌పిజి కనెక్షన్, రేషన్‌కార్డ్, ఆధార్ కార్డు ఉంటే చాలు సిలిండర్ బుక్ చేసుకున్న వెంటనే మొబైల్‌కు మెసేజ్ వస్తుందిన్నారు. మెసేజ్ రావడం లేదని కొంతమంది నుంచి ఫిర్యాదు అందుతోందిన్నారు. ఈ పథకంలో ఎవరికైనా ఏదైనా ఫిర్యాదు ఉంటే 1967 నెంబర్ కు ఫోన్ చేసి ఎల్పిజి నెంబర్ లేదా ఫోన్ నెంబర్ లేదా ఆధార్ నెంబర్ రైస్ కార్డ్ నెంబర్ తెలపవచ్చునారు. లేదా సచివాలయాల్లో పిజిఆర్‌ఎస్ పోర్టల్ లో ఫిర్యాదు చేయవచ్చున్నారు. దీపం ఒకటి లబ్ధిదారులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది అన్న వదంతులను ఎవరు నమ్మరాదని పేర్కొన్నారు. ఆక్టివ్ ఎల్పీజీ కనెక్షన్, రైస్ కార్డ్, ఆధార్ కార్డ్ ఉంటే ప్రతి ఒక్కరూ అర్హులే ఎవరు ఆత్రుత పడాల్సిన అవసరం లేదున్నారు. సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తామని తెలిపారు.

అంగన్వాడీలకు పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ

పెరటి తోటల పెంపకంతో ఆదాయం

ప్రజాశక్తి-రామాపురం

అంగన్వాడీ కేంద్రాల ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో తోటలో సాగు చేసుకుని ఆదాయం పెంచుకోవడంతోపాటు గర్భిణులు, పిల్లలకు కావలసిన పోషకాలు కలిగిన కూరగాయలు, ఆకుకూరలను అందించవచ్చని లక్కిరెడ్డిపల్లె ఐసిడిఎస్ సిడిపిఒ పద్మావతి పేర్కొన్నారు. గురువారం నల్లగుట్టపల్లి పంచాయతీలోని సుధాకర్ వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయ మండల మాస్టర్ ట్రైనర్ మధుకర్ ఆధ్వర్యంలో పెరటి తోటల పెంపకం అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుకర్ ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలు గురించి వివరించారు. ద్రవ జీవామృతం, ఘనజీవామృతం, బీజామృతం ఎలా తయారు చేసుకోవాలనే విధానాన్ని ప్రత్యక్షంగా డెమో చేసి చూపించారు. అంగన్వాడీ కేంద్రాల ప్రాంగణంలో 100 అడుగుల విస్తీర్ణంలో పెరటి తోటలను సాగు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా పండించే కూరగాయలు ఆకుకూరలలో పిల్లలకు, గర్భిణులకు కావాల్సిన పోషకాలు పుష్కలంగా లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పద్మజరాణి, హుస్సేనమ్మ, సుజాత, వ్యవసాయ క్షేత్రా రైతు సుధాకర్, యూనిట్ ఇన్‌ఛార్జి, ఉత్తమ మహిళా రైతు శ్రీదేవి, రాజగోపాల్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విభిన్న ప్రతిభావంతులు

విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

రాజంపేట పార్లమెంట్ పరిధిలోని రాజంపేట విభిన్న ప్రతిభా వంతులు సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతులు దినోత్సవం జరుగుతుందని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో పాల్గొని విభిన్న ప్రతిభావంతుల ఐక్యతను చాటాలన్నారు. అర్హులైన విభిన్న ప్రతిభావం తులకు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పుల్లం పేటలోని ఎస్‌బివిడి సభ ప్రాంగణంలో పుల్లంపేట సమైక్య సేవా సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో పేర్కొన్నారు. పుల్లంపేట అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవానికి నియోజకవర్గం లోని విభిన్న ప్రతిభావంతులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో రాజంపేట ఉపాధ్యక్షుడు ఖాదర్ బాషా, సభ్యులు వెంకట ప్రసాద్, షమ్మీ, పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం ఉపాధ్యక్షుడు వాహిద్, కోశాధికారి నరసింహులు, బాలాజీ, శీను పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-నందలూరు

మండలం లోని పొత్తపి గ్రామంలో నువ్వులసతీష్ (25) ఉరివేసుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఇంటిలోకి వెళ్లిన యువకుడు రెండు రోజులుగా బయటికి రాలేదు. తల్లి దండ్రులు ఫోన్ చేసిన సమాధానం లేకపోవడంతో, బంధువులకు ఫోన్ చేయడంతో వారు వెళ్లి ఇంట్లోకి చూడగా సతీష్ ఆత్మహత్య చేసుకొని ఉండడం కంటబడింది. మృతుడి తల్లిదండ్రులు జీవనోపాధి కోసం కువైట్ దేశానికి వెళ్లారు. తన ఆత్మహత్యకు ఎవరు కారణం కాదని మృతుడు సూసైడ్ నోట్ రాసి ఉంచాడు. సంఘటనా స్థలానికి స్థానిక పోలీసులు చేరుకొని సతీష్ ఆత్మహత్యకు గల కారణాలు దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ మిల్లర్‌లో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక పంచాయతీ చిలుకూరుపేటకు చెందిన తలారి హరినాథ(32) బుధవారం రాత్రి ట్రాక్టర్ మిల్లర్‌లో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు హరినాథ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వెనుకవైపున చేనులో ట్రాక్టర్ మిల్లర్ డ్రైవర్ బుడ్డా సోమశేఖర్‌తో కలిసి పొలం మూడు చుట్లు భూమిని దున్నారని అన్నారు. అనం తరం హరినాథను ఇంటికి పొమ్మని చెప్పడంతో ట్రాక్టర్‌ను తిప్పుకొని వచ్చే లోపల తిరిగి ప్రమాదవశాత్తు వెనుకవైపు ఉన్న మిల్లర్‌లో పడి ఇరుక్కపోయి మృతి చెందాడని తెలిపారు. వెంటనే మృతుడి అన్నకు సమాచారం ఇవ్వడంతో మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు సంఘటన స్థలానికి చేరుకున్నారని తెలిపారు. అందరూ మూడు గంటల పాటు శ్రమించి మిల్లర్‌లో ఇరుక్కపోయిన మృతదేహాన్ని బయటకు తీశారని అన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామక్రిష్ణ కానిస్టేబుల్‌తో రామకృష్ణతో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎఎస్ఐ అంజిరెడ్డి కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారని తెలిపారు.

విష ద్రావణం తాగిన యువతి...

ప్రజాశక్తి-మదనపల్లెఅర్బన్ : ప్రేమించి పెళ్లి చేసుకోవాలను కుంటున్న తమను పెద్దలు విడదీస్తున్నారని ఓ యువతి బుధవారం ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి గురువారం మృతి చెందినట్లు ఒకటవ పట్టణ పోలీసులు తెలిపారు. బెంగళూరు రోడ్డు, నక్కలదిన్నె లో ఉండే నగీన (22) మదనపల్లె రీడింగ్‌రూమ్‌వీధిలో ఓ బట్టల షాపులో పనిచేస్తూ తనతో పాటు పనిచేసే అబ్దుల్ రజాక్ ప్రేమించు కున్నారు. పెళ్లి చేసుకోవాలను కుంటున్న సమయంలో అబ్దుల్‌రజాక్ మేన మామ సయ్యద్ షావలి విడదీసి పది మందిలో పరువు తీసే విధంగా మాట్లాడడంతో మనస్థాపానికి గురైన నగీన ఎలుకల మందు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిందన్నారు. తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ గురువారం నగినా మృతి చెందిందని చెప్పారు. మృతురాలి అక్క ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

హత్య, అత్యాచార నిందితుడికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అమ్మమ్మపై అత్యాచారం చేసి, ఆపై దారుణంగా హత్య చేసిన కామాంధుడికి చిత్తూరు జిల్లా కోర్టు (పోక్సో) న్యాయమూర్తి ఎన్.శాంతి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ గురువారం సంచలన తీర్పు వెలువరించారు. మదనపల్లె రూరల్ సిఐ రమేష్ కథనం మేరకు..అన్నమయ్య జిల్లా, తంబళ్లపల్లి నియోజ కవర్గం, కురబలకోట మండలం, ముదివేడు పంచా యతి, సద్దికూటి వారిపల్లికి చెందిన జగిలి ఇంద్రప్రసాద్ 2018లో తన అమ్మమ్మపై అత్యాచారానికి పాల్పడడమే కాకుండా దారుణంగా హతమార్చాడని చెప్పారు. అప్పటి సిఐ, ప్రస్తుత సిఐ రమేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు అనం తరం నింధితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కాగా చిత్తూరు జిల్లా కోర్టు (పొక్సో)లో గురువారం కేసు తుది విచారణ జరిగింది. నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో ముద్దాయి ఇంద్రప్రసాద్‌కు యావజ్జీవ శిక్ష విధిస్తూ న్యాయమూర్తి శాంతి సంచలన తీర్పు చెప్పారు.